## క్లుప్తంగా

### ఎమ్మెల్యే భారీ ఫ్లెక్సీ ఏర్పాటు



ఎమ్మెల్యే నివాసం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

**నేరడిగొండ:** బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఆయన నివాసం వద్ద భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి వేడుకలకు సిద్ధం అయ్యారు.

### ఘనంగా భీమన్న దేవుని పండుగ



పూజలు చేస్తున్న ముదిరాజ్‌లు

**తాంసి:** మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్తులు ఆదివారం భీమన్న దేవుని పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఏటా వర్షాకాలం ప్రారంభంలో నిర్వహించే భీమన్న పండుగలో భాగంగా ఆదివారం ముదిరాజ్‌లు భీమన్న దేవుడికి పూజలు చేశారు. డప్పుచప్పులతో ఊరేగింపుగా వెళ్లి తమ కుల దైవానికి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గుగ్గిల పొచ్చన్న, యువజన విభాగం అధ్యక్షుడు రాఘవేంద్ర, కులపెద్దలు జీవన్, పోశెట్టి, రమాకాంత్, శ్రీకాంత్, వెంకటస్వామి, శ్రీనివాస్, దేవన్న పాల్గొన్నారు.

### అందని మొబైల్ సిగ్నల్స్

**సిరికొండ:** మండల కేంద్రంలో గత 15 రోజుల నుంచి మొబైల్ సిగ్నల్స్ అందక వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్‌తో పాటు ప్రైవేట్ కంపెనీ జియో సిగ్నల్స్ సాంకేతిక సమస్యతో సిగ్నల్స్ రావడం లేదు. కనీసం ఫోన్ మాట్లాడుదాం అన్నా.. సిగ్నల్స్ అందడం లేదని వినియోదారులు వాపోతున్నారు. అనేకసార్లు ఫిర్యాదులు చేసినా.. లాభం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిగ్నల్స్ సమస్యతో ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా పనులు జరగడం లేదు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

### విద్యార్థినికి సన్మానం



రాజేశ్వరిని సన్మానిస్తున్న నాయకులు

**ఆదిలాబాద్‌రూరల్:** పదో తరగతిలో ఆదిలాబాద్ రూరల్ మండల టాపర్‌గా నిలిచిన మండలంలోని అంకోలి గ్రామానికి చెందిన మున్నూరు కాపు విద్యార్థిని కల్యానం రాజేశ్వరిని మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆది వారం శాలువా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఎర్రం నరసింగ్‌రావు కా పులు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుండాలన్నారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మున్నూరు కాపు విద్యార్థులకు, యువతకు అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కనక వెంకట రమణ, ప్రభాకర్, పూదరి రాహుల్, రామ్, దత్తు, అక్షయ్, తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధులను గౌరవించాలి

**ఆదిలాబాద్‌టౌన్:** వృద్దులను గౌరవించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి అన్నారు. ప్రపంచ వృద్ధుల వేధింపు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘ భవనం ఆవరణలో మొక్కలు నాటారు. ఇబ్బందులకు గురిచేయకుండా వారి ఆరోగ్యంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సమైఖ్య అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే, లక్ష్మారెడ్డి, నర్సిములు, పోశెట్టి, హన్మంత్ రెడ్డి, శంకర్, గంగాధర్ పాల్గొన్నారు.

### కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

**ఆదిలాబాద్‌టౌన్:** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని డీఈవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఏకలవ్య ఫౌండేషన్ విద్యావాహిని ఆధ్వర్యంలో ఆదివారం డైట్ కళాశాలలో ప్రతిభ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రెటరి కందుల గజేందర్, డైట్‌కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, నర్స య్య, దిగంబర్, పర్యాల్, హన్మాండ్లు పాల్గొన్నారు.

### లయన్స్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

**ఆదిలాబాద్‌టౌన్:** లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆదిలాబాద్ కింగ్స్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంద అశోక్, కార్యదర్శిగా దుర్గే భగవాన్‌దాస్, కోశాధికారిగా బూక గంగయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్‌క్లబ్ రెండో గవర్నర్ గుంటుక చంద్రప్రకాష్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆదిలాబాద్‌అర్బన్ ఎంఈవో సోమయ్య, రీజియన్ చైర్మన్ సురేశ్ బాబు, సభ్యులు ప్రవీణ్, రమాకాంత్‌రావు, వెంకటరమణ, నరేందర్, సత్యనారాయణ, విశ్వాస్, కరీం అలీ పాల్గొన్నారు.

# సమీకృత గురుకులం లేనట్లేనా?



సమీకృత గురుకుల కోసం కేటాయించిన స్థలం

- రెండు విడతల్లో బోథ్‌కు మొండిచేయి
- ఇచ్చోడలో 19 ఎకరాల స్థలం కేటాయింపు

**ఇచ్చోడ:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక్కటి చొప్పున సమీకృత గురుకులాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇంత వరకు బాగానే ఉంది. కానీ ఇంటిగ్రేటేడ్ పాఠశాలలో ఎంపికలో మొదటి, రెండో విడత పూర్తయిన నియోజకవర్గానికి ప్రభుత్వం మొండిచేయి చూపింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంచిర్యాల, ఖానాపూర్ నియోజకవర్గాలకు మాత్రమే మంజూరు చేసిన ప్రభుత్వం అత్యంత వెనుకబడిన ఎస్టీ నియోజకర్గమైన బోథ్ నియోజకవర్గానికి మంజూరు చేయకపోవడంతో విమర్శలు వెలువెత్తుతున్నాయి.

**ఒకే చోటుకు గురుకులాలు..**

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీవర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించేందుకు ప్రభుత్వం అన్ని గురుకులాలను ఒకే చోటికి చేర్చి ఇంటిగ్రేటేడ్ గురుకుల సముదాయాలను నిర్మించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసింది. నిర్మించిన గురుకులాల ద్వారా 4 నుంచి 12వ తరగతి వరకు పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యబోధన అందించే విధంగా ప్రణాళిక రూపొందించింది. విద్యార్థులకు అన్ని రకాల వసతులు, సిబ్బందికి ప్రత్యేక క్వార్టర్లు, డిజిటల్ గ్రంధాలయం, కంప్యూటర్ శిక్షణ, క్రీడల కోసం మైదానం ఇలా ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధన అందించే దిశగా ఇంటిగ్రేటేడ్‌కు శ్రీకారం చుట్టింది.

**బోథ్‌కు మొండిచేయి..**

ఇచ్చోడలో ఇప్పటికే సోషల్‌వెల్ఫేర్ బాలుర కళాశాల, మహాత్మా జ్యోతిబా పూలే, కళాశాలలు అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. అరకొర వసతుల మధ్య మైనార్టీ గురుకుల కళాశాల కొనసాగుతోంది. ఈమూడు కళాశాలలో దాదాపుగా 2 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దీంతో నియోజకవర్గంలో ఇచ్చోడ మండల కేంద్రంలో ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ ప్రభుత్వం మొదటి, రెండో విడతలో మొండిచేయి చూపింది.

**స్థలం కేటాయింపు..**

మండల కేంద్రంలోని అడేగామ(కె) శివారులో ఇంటిగ్రేటేడ్ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల సముదాయం కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు 19 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి కలెక్టర్‌కు నివేదిక అందచేశారు. కేటాయించిన స్థలం మండల కేంద్రానికి అతీ సమీపంలో బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డుకు ఆరు కిలోమీటర్ దూరంలో ఉంటుంది.

**పక్షపాతం చూపొద్దు**



పేద విద్యార్థులకు మెరుగైన విద్యబోధన అందించే విషయంలో ప్రభుత్వం పక్షపాతం చూపొద్దు. అత్యంత అవసరం ఉన్న చోట ముందుగా మంజూరు చేస్తూ.. ప్రణాళికబద్ధంగా ప్రభుత్వం ముందుకు వెళ్లాలి. బోథ్‌కు ప్రాధన్యత ఇచ్చి మంజూరు చేయాలి.
– నిమ్మల ప్రీతంరెడ్డి, మాజీ ఎంపీపీ, ఇచ్చోడ

**అద్దె గదుల్లో..**



మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలుర కళాశాల, మహాత్మా జ్యోతిబా పూలే కళాశాలాలు అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. దీంతో ప్రతీ ఏటా కోట్ల రూపాయలు ప్రజాధనం వృధా అవుతుంది. ఇచ్చోడ మండల కేంద్రంలో ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్‌ను ఏర్పాటు చేయాలి.
– కొత్తురి సూజాత, మాజీ ఎంపీటీసీ, అడేగామ(కె)

**చిన్నచూపు చూడకూడదు**



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అత్యంత వెనుకబడిన బోథ్ ఎస్టీ నియోజకవర్గంపై ప్రభుత్వం చిన్నచూపు చూడొద్దు. పేద విద్యార్థులకు విద్యను అందించే విషయంలో రాజకీయలకు అతీతంగా ఇచ్చోడలో ఇంటిగ్రేటేడ్ కళాశాలను మంజురు చేయాలి. – లక్ష్మణ్, మాజీ సర్పంచ్, వర్తమన్నూర్, బజార్‌హత్నూర్ మండలం

# ‘స్థానికం’పై సర్వత్రా ఆసక్తి

- నేడు రానున్న స్పష్టత
- ప్రయత్నాలు ముమ్మరం చేసిన ఆశావహులు

**కైలాస్‌నగర్:** స్థానిక సమరానికి సంబంధించి ఈనెలాఖరు లోపు ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్నట్లు రాష్ట్ర మంత్రులు సీతక్క, పొంగులేటి ఇటీవల ప్రకటించడంపై ఆశావహులు అప్రమత్తం అవుతున్నారు. ఏడాదిగా ఇలాంటి ప్రకటనలు వస్తున్నప్పటికీ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనే సంకేతాలు ఇవ్వడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. స్థానిక సమరంపై సోమవారం రాష్ట్ర మంత్రివర్గం ప్రత్యేకంగా సమావేశం కానుండడంతో ఎలాగైనా షెడ్యూల్ రానుందని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. అయితే తొలుత పంచాయతీ ఎన్నికలా.. లేక పరిషత్ ఎన్నికలా అనే దానిపై సందిగ్ధం నెలకొంది. తొలుత పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసినప్పటికీ ప్రభుత్వం పరిషత్ ఎన్నికలపైనే దృష్టి సారిస్తుండడంతో కొంతమంది ఆశావహుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే ఎన్నికలు ఏవైనా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రకటన విడుదలైతే జిల్లాలో రాజకీయ వేడి షురూ కానుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

## టీపీయూఎస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

**ఆదిలాబాద్‌టౌన్:** జిల్లా కేంద్రంలోని మాధవ నిలయంలో ఆదివారం టీపీయూఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. న్యూరో డాక్టర్ గోవింద్ మంద శిబిరంలో పాల్గొని దాదాపు 50 మందిని పరీక్షించి ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలిసిందిగా సూచనలు చేశారు. ఈ సందర్భంగా టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహాన్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేయడంతో పాటు సమాజ హితం కోసం తమ సంఘం పనిచేస్తుందని అన్నారు. వైద్య శిబిరంలో సేవలందించిన వైద్యులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహాన్, వలబోజు గోపికృష్ణ, తోగరి ప్రకాష్, కదాసు రాజేశ్వర్, మెస్రం రాజ్ కుమార్, కృష్ణసాగర్, గంభీర్, కేశవ్ పాల్గొన్నారు.

## విమాన ప్రమాద మృతులకు నివాళి



నివాళులర్పిస్తున్న సీఐ, సభ్యులు

**ఆదిలాబాద్:** అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మృత్యువాత పడిన వారికి సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని అమర వీరుల స్తూపం వద్ద కొవ్వొతులతో పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో పాల్గొన్న వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ మాట్లాడుతూ విమాన ప్రమాద ఘటన దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఎంతో మంది కుటుంబాల్లో సంఘటన విషాదం నింపిందన్నారు. కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, కోశాధికారి సూర్యకాంత్, కందుల రవీందర్, శశికాంత్, సమితి సభ్యులు ఉరడే సుభాష్, శివ, సంతోష్ అగర్వాల్, శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బోనమెత్తిన సిర్సన



బోనాలతో వస్తున్న మహిళలు

**సాత్నాల:** భోరజ్ మండలంలోని సిర్సన గ్రామ ప్రజలు ఆదివారం ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించారు. గ్రామంలో పోచమ్మ తల్లి, రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశా రు. మూడు రోజులుగా ప్రత్యేక పూజలు చేసి, డప్పు చప్పళ్లతో ఆలయానికి వచ్చి అమ్మవారి కి మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పంటలు సంమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు.

### సంక్షేమ బోర్డు ప్రైవేట్‌పరం చేయొద్దు

**ఆదిలాబాద్‌టౌన్:** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయవద్దని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు గాజంగుల రాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నేతాజీ చౌక్ వద్ద భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డుతో కార్మికులకు అనేక లాభాలు ఉన్నాయన్నారు. సంక్షేమ బోర్డును ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 17న హైదరాబాద్‌లోని భవన సంక్షేమ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి, హక్కుల సాధన కోసం చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు.

### నేడు రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ ప్రారంభం

**నేరడిగొండ:** మండలంలోని వడూర్, బుగ్గరం గ్రామాలలోని రైతు వేదికలో నూతనంగా ఏర్పాటు చేసిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌ను సోమవారం ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

### ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**ఇచ్చోడ:** ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన యువతీ, యవకులకు మగ్గంవర్క్, బ్యూటీ పార్లర్, హౌస్ వైరింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్, టూ వీలర్ మెకానిక్, ఫొటోగ్రఫీలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జేడీఎం నాగభూషణం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు ఇచ్చే శిక్షణలో ఉచిత భో జనం, వసతి, రెండు జతల డ్రెస్సులు, బస్సు చార్జీ లు టూల్ కిట్‌లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ తర్వాత సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో సంప్రదించాలని 96667 48105 కోరారు.

### బీజేపీతోనే సుపరిపాలన సాధ్యం



మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

**ఇచ్చోడ:** బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్ అన్నారు. కేంద్రంలో 11 సంవత్సరాలుగా బీజేపీ అధికారంలో ఉంటూ.. ప్రజలకు సేవలు అందిస్తున్న సందర్భంగా మండల కేంద్రంలో మొక్కలు నాటారు. బీజేపీ అధికారంలో ఉండటంతోనే అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. అందరి సంక్షేమం కోసం ప్రత్యేకంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, అసెంబ్లీ నియోజవర్గ ఇన్‌చార్జి కధం బాబారావు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**నార్నూర్:** పిడుగు పడి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడం తీవ్రంగా కలిచివేసిందని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆదివారం గాదిగూడ మండలంలోని పిప్రి గ్రామానికి చేరుకోని బాధిత కుటుంబానికి పరామర్శించారు. మృతి చెందిన మంగం భీంబాయి కూతురితో మాట్లాడారు. వారి కుటుంబసభ్యులు, బంధువులకు ఆమె ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి కాంట్రాక్ట్ ఉద్యోగం ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయ పనులకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ స్తంభాలు, నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో నిలబడవద్దన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు మర్సుకోల సరస్వతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్, ఫాక్స్ చైర్మన్ అడే సురేశ్, ఫాక్స్ డైరెక్టర్ కాంబ్లే ఉద్ధవ్, మాజీ సర్పంచ్ మాడవి జాకు, పూసం బాదిరావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి



మాట్లాడుతున్న జోగు రామన్న

**ఆదిలాబాద్‌టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అసమర్థ విధానాలను ఎండగట్టాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జైనథ్, భోరజ్ మండలాల నేతలతో సమావేశమై దిశ నిర్దేశం చేశారు. ప్రజలకు 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలులో మాత్రం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రజలకు బూటకపు హామీలు ఇచ్చి మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎందుకు కేసులు నమోదు చేయరని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే పనితీరు పట్ల సైతం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయని మండిపడ్డారు. సంక్షేమ పథకాల ఫలాలు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు మెట్టు ప్రహ్లాద్, మార్శెట్టి గోవర్ధన్, విజ్జగిరి నారాయణ, యాసం నర్సింగ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న రవికిరణ్ యాదవ్

**కైలాస్‌నగర్:** మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా అందించే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆ ట్రస్ట్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో టైలరింగ్, మగ్గం, ఎంబ్రాయిడరి, ఉన్ని దుస్తుల తయారీ, బ్యూటీషియన్ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని ఆసక్తిగల మహిళలు, యువతులు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సాయి వైకుంఠ ట్రస్ట్ డైరెక్టర్లు సల్ల విజయబాబు, మట్టా శ్రీనివాస్, నర్రా నవీన్ యాదవ్, రామన్న, హరిదర్ కౌర్, శ్రీనివాస్ యాదవ్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా మరుగుదొడ్లు



నేరడిగొండ మండల పరిషత్ కార్యాలయంలోని మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఉద్యోగులతో పాటు పంచాయతీ కార్యదర్శులు సమావేశాలు నిర్వహించినప్పుడు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు మేల్కొని వాటిని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.
- నేరడిగొండ

## దాడులకు పాల్పడిన ఇరువురిపై కేసు

**సాత్నాల:** దాడులకు పాల్పడిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు జైనథ్ ఎస్సై గౌతమ్ పవార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శనివారం రాత్రి ఆదిలాబాద్ పట్టణం నుంచి నలుగురు వ్యక్తులు ఆటోలో జైనథ్‌కు బయల్దేరి వెళ్లారు. ఇందులో ప్రయాణిస్తున్న సాయికిరణ్‌ను జందాపూర్‌లో వదిలేందుకు ఆటోను అటువైపు మళ్లించగా, అందులో ప్రయాణిస్తున్న తర్నంకు చెందిన నరేశ్ భయభ్రాంతులకు గురై ఆటోలో నుంచి దూకి పరారయ్యాడు. దీంతో ఆటో డ్రైవర్ మహేందర్, మరో వ్యక్తి సాయిస్వామిలు ఆయనను పట్టుకొని దాడి చేశారు. డబ్బులు ఇవ్వకుండానే పరారవుతున్నట్లు తెలిపారు. దీంతో బాధితుడు తన స్నేహితులకు ఫోన్ ద్వారా విషయాన్ని తెలియజేశాడు. ఆ గ్రామానికి చెందిన పలువురు తర్నం వద్ద ఆటోను అడ్డుకొని డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తిపై దాడి చేశారు. దీంతో ఇరువురు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, రెండు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## మహా ధర్నా జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

**ఆదిలాబాద్‌అర్బన్:** ‘ఆపరేషన్ కగార్’ నిలిపివేయాలని సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టే మహా ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు దగ్గర ఈనెల 17న ఉదయం 11 గంటలకు మహాధర్నా జరుగుతుందన్నారు. ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను, అమాయక ఆదీవాసిలను అణచివేతకు గురిచేస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోవర్ధన్, అరుణ్ కుమార్, కుంటాల రాములు, అమీనా ఖాన్, అర్ధాంగి రమేశ్, రామదాస్, గణేష్ పాల్గొన్నారు.